# ఆశయాలకు పంకెళ్ళు

St. JOSEPH'S JUNIOR COLLEGE.
Book No. ............
LIBRARY

# ఆశయాలకు సంకెళ్లు

అతను బోనెక్కాడు!

అవమానంతో అడుగడుగునా కృంగిపోతున్న అతని మనో వేదన ముఖంలో కన్పడటం అందరూ గమనిస్తూనే ఉన్నారు.

కోర్టుహాల్లో గోడగడియారం పదకొండు గంటలు గంభీరంగా కొట్టింది!

'ఫ్యూరీ' లోంచి లాయరు లేచి బోనును సమీపిస్తూ 'మిలార్డు! ఇది విడాకుల కేసు! కేసు విచారణకై ముద్దాయిని క్రాసెగ్జామినేషన్ చేసేందుకై అనుమతి ఇవ్వవలసిందిగా కోర్టువారిని కోరుతున్నాను' అంటూ గౌను సవరించుకున్నాడు ఠీవిగా!

'యస్. యు కెన్ ప్రొసీడ్' జడ్జి హుకుం జారీచేశాడు.

"మీ పూర్తి పేరు?" లాయరు ప్రశ్న.

"మాధవం!"

"మాధవంగారూ! మీకు సుశీలాదేవిగారితో వివాహమై ఎన్నాళ్ళయింది?" గీగంటితో కళ్ళద్దాల్లోంచి చూస్తూన్న లాయరు మరో ప్రశ్న విసిరాడు.

"రెండు సంవత్సరాలయింది!!"

"సుశీలాదేవిగారితో వివాహం కాకపూర్వం ఆమెతో మీ కేమైనా పరిచయం ఉందా?!"

"లేదు!"

"పోనీ—ప్రేమించి వివాహం చేసుకున్నారా!"

"కాదు!"

"అయితే, పెద్దలే నిర్ణయించి మీ వివాహం జరిపించారా!!"

"అవును!!"

"పెళ్ళికి మీ తరఫున వచ్చిన పెద్ద లెవరెవరు??"

"ఎవరూ లేరు."

"అంటే, పెళ్ళికి మీ రొక్కరే వెళ్ళారా?"

"అవును!"

"మీకు బంధువులుగానీ, కావల్సినవారుగానీ ఎవరూ లేరా??—"

"లేరు!"

"పోనీ, మీకు స్నేహితులుకూడా ఎవరూలేరా?"

"రాలేదు."

"మీకసలు స్నేహితులే లేరన్నమాట!!—"

"చాలామంది ఉన్నారు! కానీ, నాకై నే నెవ్వరినీ పెళ్ళికి ఆహ్వానించలేదు!!"

"కారణం? - ?"

"జరగబోయే శుభకార్యానికి, ముందు ముందు సాక్ష్యాలూ, ఋజువులు కావల్సి ఉంటాయని ఊహించ లేదు!-"

"సాంప్రదాయకంగా జరిగినది వివాహమా? లేక రిజిష్టరు మేరేజా?-"

"రిజిష్టరు మేరేజి!"

"అందుకు వీరు సమ్మతించారా?!"

"'పెళ్ళంటే' భార్యాభర్తల జన్మాంతర సంఘీభావ మనే నా ఉద్దేశ్యం. అందుకే పెళ్ళి ఏ పద్ధతిలో జరిగినా ఎవరినీ పిలవలేదు!!—"

"అయితే, పెళ్ళి అయిన రోజునుండి మీ భార్యను మీరు హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారా? – కాపురం వడుదుడుకులు లేకుండా చేస్తున్నారా??"

"ప్రేమించటంలో మరో విధంగా మాత్రం నాకు తెలీదు! అప్పటికీ ఇప్పటికీ సుశీలయందు అవ్యాజనీయమైన ప్రేమ నాకున్నది!!"

"ఇద్దరిమధ్యా అనురాగం లేకపోవటానికి, ఇప్పుడీ విడాకుల ఏర్పాట్లు జరగటానికీ కారణాలేవైనా మీరు చెప్ప గలరా?"

"క్షమించండి! నేనేమీ చెప్పలేను!! కానీ ఒక్కటి మాత్రం నిజం! విడాకులు కావాలని కోరుకున్నది సుశీల! నన్ను రోజూ వత్తిడిజేసి నాచే బలవంతాన్నైనా విడాకులు తీసుకునేందుకై ప్రయత్నించింది!"

"అదే!...పోనీ...ఆమె మన స్తత్వంలో మార్పువచ్చి మిమ్మల్ని విడాకులు ఇవ్వవలసిందిగా వత్తిడి చేయటంలోగల కారణం చెప్పండి!!"

"..................."

"Mr. మాధవం! మీరేం చెప్పలేరా?"

"క్షమించండి. ఇంతకుమించి నేనేమీ చెప్పలేను!" అంటున్న మాధవం కంటిలో నీరు నిండింది. మనిషి బాగా నీరసించినట్లు కన్పిస్తున్నాడు.

"దట్సాల్ యువరానర్!!" లాయరు వెళ్ళి సీటులో కూర్చున్నాడు. ముద్దాయి మాధవం బోనులోంచి బయట కొచ్చాడు. కేసు వారంరోజులకు వాయిదా పడింది!!

"మాధవంగార్కి—

నమస్తే! నన్ను నేనుగా పరిచయం చేసుకుని ఇది వరలో చాలా ఉత్తరాలు వ్రాసేను. మీనుండి జవాబు పొందగలిగే అదృష్టం నా కింతవరకు కలుగలేదు. కారణం అనూహ్యం. అయినా అడిగినవారికల్లా జాబులు వ్రాస్తూ మీ కున్న అమూల్యమైన 'టైము' వేష్టుజేయ తల్చుకుని వుండరని మాత్రం ఊహిస్తున్నాను!

కానీ, మాధవంగారూ! ప్రస్తుతంలో మీకున్న పేరు ప్రఖ్యాతులు, గౌరవం పేపర్ల ద్వారా చడవటమేగానీ, మిమ్మల్ని చూచి ముఖాముఖిన మాట్లాడే అదృష్టం నాకింత వరకు కలగలేదు!—

మీ సంస్కారం, సహృదయం, నన్నెంతగానో ఆక ర్షించినయి. మీ ఆశయాలను, ఆశలను రోజుకో క్రొత్త

రూపంలో వన్నె తెస్తున్నట్టు మీ రచనలద్వారా అర్థంచేసు కోగల్గుతున్నాను!!—

మొన్నీ మధ్యనే వెలువడిన మీ నవల 'ఆద్యంతాలు' నన్ను ముగ్ధురాలను చేసింది. నే నీ విధంగా మిమ్మల్ని పరో క్షంగ ప్రస్తుతిస్తున్నందుకు నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నాను!

మీ గురించి వివరాలు తెల్సుకోగోరే అందరి పాఠకు ల్లాగా కాకుండా, మీ హృదయంలో నాకొక ప్రత్యేక స్థానా న్నిచ్చి, కనీసం ఈ సారైనా ఓ జాబు వ్రాస్తారని ఆశిస్తూ, మీ ఆశయ సిద్ధికి సర్వదా తోడ్పడగలననే ఆకాంక్షతో నిరీ క్షిస్తూ జాబు ముగిస్తున్నాను.

శలవు,

సుశీల."

ఉత్తరాన్ని రెండుమాట్లు చదివాడు మాధవం!!—

రాత్రి ఎనిమిది గంటలయింది. గది మధ్యలో కిరస నాయిలు లాంతరు వ్రేలాడుతున్నది. గది తలుపు ప్రక్కనే చల్లగాలికోసం చాపమీద వెల్లకిలా పడుకుని ఆలోచిస్తు న్నాడు.

సుశీలదగ్గర్నుంచి ఉత్తరం రావటం ఇది మూడోసారి! ఈ తడవయినా సమాధానం ఇవ్వకుండా ఉంటం బావుండ దనిపించింది. అయితే సమాధాన మేమివ్వాలి? - ఎలా ఇవ్వాలి?? - అన్నదే సమస్య.

సమస్య! ? !—

రచయితగ స్థిరపడ్డ మాధవం ఒక్క అపరిచిత అబ లకు జాబు వ్రాయటమే సమస్యగా తయారయింది!

సమాధానం ఇవ్వవలసిందిగ సుశీల ఎందుకలా పదే పదే అడుగుతున్నదో అర్థమవడంలేదు.—

బహుశః ఆమెకూడా ఓ సాహితీ ప్రియురాలై ఉండ వచ్చని పించింది! పైన వ్రేలాడుతున్న లాంతరుదించి చాప మీద ఉంచాడు—

"సుశీలగార్కి,

మీ జాబులన్నీ సరాసరి నాకే అందేయి! మీరు తీసు కుంటున్న శ్రమకు నా ధన్యవాదాలు!!

చూడండీ, ఉత్తరాలు వ్రాయడమనేది నాకు అల వాటులేదు. పైగా, మీ రనుకున్నట్టు, నాకున్న కొద్దిపాటి విరామసమయాన్ని ఏదో వ్రాతకోసం వినియోగిస్తుంటాను.

నాగురించి మీరు ఎందుకంత గొప్పగ ఊహించు కుంటున్నారో నా ఊహ కందటంలేదు! నా రచనలు చదివే పాఠకుల్లో మీరు ముఖ్యులని మాత్రం మీ ఉత్తరాల ద్వారా తెలుసుకోగల్గుతున్నందుకు మరోమారు నా ధన్య వాదాలు!!—

నా గురించి నాకే ఎక్కువ తెలీదు! వివరంగా విష యాలు వ్రాయటానికి సాహసించలేను.

తీరిక వేళల్లో సాహితీ ప్రియులైన మీలాటి వారి. కోసం ఉత్తరాలు వ్రాయడం ఇకనుండయినా ఒక అలవా. టుగా చేసుకుంటాను.

ఉంటాను!!

శలవు,
భవదీయుడు,
మాధవం.

ఆకలివేస్తున్న మాధవానికి ఎదురుగా హోటల్ కన్పించింది. మంచినీటితోనైనా ప్రస్తుతానికి కడుపునింపుకోనాలన్పించిన మాధవం హోటల్లో జొరబడ్డాడు.

అప్పుడే హోటల్ ప్రొప్రయిటరు ఓ సప్లయిరుమీద తగాదా పెట్టుకొని బయటికి పంపేయడం మాధవం కళ్ళబడ్డది.

కష్టం చేయటానికి అలవాటు పడని మాధవం, కనీసం సప్లయిరు ఉద్యోగం చేసినా కడుపునిండా భోజనం దొరుకుతుందన్పించటంతో చివ్వునలేచి క్యాషియర్ దగ్గరకెళ్ళాడు. ఉద్యోగం యిప్పించమంటూ సవినయంగా అడిగాడు పదిహేనేళ్ళ మాధవం.

మాధవం వంటరి!-

చిన్నతనంలోనే తల్లిదండ్రులు దూరమయ్యారు!

నయాపైసా ఖరీదు చేయని మాధవాన్ని అయినవాళ్ళెవరు చేరదీయకపోవటం అతని దురదృష్టానికి జోడింపయింది -

స్వయం సంపాదనకై బయల్దేరిన మాధవం, నాలుగు వీధులమధ్య వట్టిచేతులతో నిల్చున్నాడు.

శూన్యంలోకి చూచాడు.

గుమస్తా ఉద్యోగం కావాలనుకున్నా, బి. ఏలు పాసైన వారికే గతిలేని ఈ రోజుల్లో, గౌరవంగా పొట్టపోసుకోవటమెట్లా? అదే అతని తీరని సమస్య!-

సమస్యలమధ్య నలిగిపోతున్న మాధవం సప్లయరు ఉద్యోగంలో కుదిరాడు -

పూర్వజన్మ సుకృతం కొద్దీ చిన్న చదువు చదువుకునే రోజులనుండి తెలుగుభాష అంటే అవ్యాజనీయమైన అభిమానం మాధవానికి!

సాహిత్య పఠనం 'హాబీ' గా పెట్టుకున్నాడు.

స్వయం కృషితోనే కావలసిన అనుభవాన్ని సంపాదిస్తూ స్వంతగా ఊహించటం, అతని అనుభవాలను జోడింపు చేసి ఏవేవో వ్రాయటం అలవాటు చేసుకున్నాడు.

మాధవం సర్వారు! అయినా, అతని కొద్దిపాటి సంపాదనతోనే 'లైబ్రెరీ' లో మెంబరయ్యాడు. కావలసిన తెలుగు సాహిత్యాన్ని అవగాహన చేసుకుంటూ భాషాజ్ఞానం కోసం కృషి చేస్తున్నాడు.

రోజులు గడుస్తున్నాయి!-

వసంతాలు దొర్లిపోతున్నాయి!!-

పాతికేళ్ళొచ్చేసరికి ఒక ప్రముఖ రచయితగ అందరికీ పరిచితుడయ్యాడు.

రచనలు పత్రికలవారికి పంపడంద్వారా, అతని కృషికి తగినంతగ ప్రోత్సాహం కన్పించడంతో మరింత ఉత్సాహం ఎక్కువవుతూ వచ్చింది!

మాధవం చదువు సంస్కారం ఉన్నవాడని హోటలు ప్రొప్రయిటరుకు తెల్సింది. ఒక రోజున ఇంటికి పిలిపించాడు. క్యాషియరుగా, నియమించ బోతున్నట్లు తెలీజేశాడు.-తగిన కృతజ్ఞత తెలుపుకున్నాడు మాధవం.

అయితే; అతని జీవితంలో అదృష్టమనే మలుపు ఎంత దూరంలో ఉందో అతనికే తెలీదు!

జీవితంతోబాటు మరోవైపు ఆ రచనల ద్వారా ఆదాయం పెరుగుతున్నా, మాధవంలో ఎటువంటి మార్పూ రాలేదు.

ఉద్యోగం! తీరికవేళల్లో సాహిత్యపఠనం!! ఆ తర్వాత వ్రాసుకోవటం!!! ఇదీ, మాధవం దైనందిన చర్య -

*　　　*　　　*

వాతావరణం చల్లబడ్డదనే చెప్పాలి! ఒడ్డునే కూర్చున్న సుశీల పాదాలను కెరటాలు అప్పుడప్పుడు స్పృశిస్తున్నాయి.

మాధవం వ్రాసిన ఉత్తరాన్ని మరోమారు చదివింది, ఓ చిరునవ్వు ప్రకృతిలోకి విసిరేసింది.

పూర్తి వివరాలేమీ వ్రాయనందుకు బాధపడ్డది మనసులో... కానీ, అసలు మాధవం వద్దనుండి జాబువస్తుందా రాదా అనుకున్న సుశీలకు మనశ్శాంతిని కలిగించిందీ ఉత్తరం!

సుశీల మనసులో మళ్ళీ ఆలోచన రంగుల రాట్నంలా తిరుగుతోంది. మాధవం అంటే ఎందుకంత యిష్టం!...... కాదు... ప్రేమ!!...

అతనెలా ఉంటాడో ఇంతవరకూ చూడనైనా లేదు. కేవలం అతని రచనల ద్వారానే ఓ విధమైన రూపాన్ని హృదయంలో చిత్రించుకుంది.

ఇంతకూ తనంటే మాధవంలో ఏ విధమైన అభిప్రాయ ముందో ఉత్తరంలో వ్యక్తం చేయలేదు -

ఏమైనాసరే మనసులో ఉండే ఆమె కోరికను చెప్పి మాధవాన్ని ఒప్పించాలనే నిర్ణయం తీసుకుంది!-

మాధవాన్ని వాల్తేరు రప్పించే విషయంలో తండ్రి నుండి అంగీకారం ఎప్పుడో తీసుకుంది. ఒక్కతే ఆడపిల్ల అవటంతో శ్రీధరంగారుకూడా అభ్యంతర మేమీ చెప్పలేక పోయారు.

విచిత్రమైన మనస్తత్వంగల వ్యక్తి సుశీల!-

ప్రతిరోజు కాలక్షేపంకోసం బీచ్ కిరావటం అలవాటు. మాధవంలాంటి వ్యక్తి తనకు భర్తగా అవాలని అహర్ని శలు తాపత్రయ పడుతూంటుంది.

మధ్యాహ్నం పన్నెండు గంటల సమయం -

టెలిగ్రామ్ స్వయంగి సుశీల చేతికి తీసుకుంది. ముఖం ఆనందంతో విప్పారింది.

"ఏమిటమ్మా అది?" రీడింగు రూములోంచి వస్తూ అడిగారు.

"ఏం లేదు నాన్నా! మనం అనుకున్నట్టే జరిగింది!! మాధవం ఈరోజు రాత్రి రైల్లో బయల్దేరి వస్తున్నారట!!"

"అయితే ఇంకేం స్టేషన్‌కు కారు తీసుకుని స్వయంగా వెళ్ళు!"

"సరే నాన్నా! కాని మీరు మాత్రం ప్రొద్దున్నే క్లబ్ కు మాత్రం వెళ్ళకండి!"

"నువ్వాజ్ఞాపించిన తర్వాత తప్పేదేముంది."

హాయిగా తెల్లవారింది రాత్రి...

కార్లో బయల్దేరింది సుశీల!

డ్రయివరు తెచ్చిన ప్లాట్ ఫారం టిక్కెట్టు తీసుకుని లేడీస్ వెయిటింగ్ రూముపైపు దారితీసింది.

రైలువచ్చి బరువుగా ప్లాట్ ఫారంమీద నిల్చుంది.

సుశీల మాధవం కోసం వెదుకుతూనే ఉంది!-

మాధవం రాలేదనే నిర్ణయానికొచ్చిన సుశీల ఇంటి ముఖం పట్టింది-

కారు కదిలింది-

"అమ్మా! వారు రాలేదా?" డ్రయివరు ప్రశ్న.

"లేదు! బహుశః తర్వాత బండికేమైనావస్తారేమో?" సుశీలలో నిరుత్సాహం ఉట్టిపడ్డది.

పోర్టికోలో కారాగింది! డ్రయివరు డోరు తీశాడు.

"సుశీ! వంటరిగా వచ్చావేం? అతనేడి?" శ్రీధరంగారి ప్రశ్న.

"రాలేదు నాన్నా!" చిన్నబుచ్చుకుంటూ సమాధాన మిచ్చింది.

"బహుశః...ట్రయిను మిస్సయి ఉండొచ్చు!"

"నమస్తే సుశీలాదేవి..." అనుకోనట్టు మరో క్రొత్త కంఠధ్వని పిన్పించింది.

బిత్తరపోయింది సుశీల!

సుశీల ముఖం విప్పారింది.

"మిమ్మల్ని స్టేషన్లో చూచేను...కాని గుర్తించలేక పోయాను" సుశీల అదోలా అన్నది.

"మరేం ఫర్వాలేదు. మీ ఇల్లు తేలిగ్గానే తెలుసుకో గలిగాను."

"అయితే సుశీ! నేనే నయం!!-అతను ఇతనేనని ఇంటికి రాగానే గుర్తించాను."

"భలేవారే నాన్నా! నన్నవససరంగా 'సస్పెన్సు'లో ఉంచారు."

"బహుశః మీకు నిరుత్సాహం కలిగించిఉంటాను."

"స్టేషన్‌లో కన్పించకపోయాక అలాగేఅనుకున్నాను. కానీ...ఇప్పుడు...మీరు నాన్నగారితో మాట్లాడుతూ ఉండండి...కాఫీ తెస్తా నీలోగా" సుశీల ఇంట్లో కెళ్ళింది.

శ్రీధరంగారు నవ్వేరు...

మాధవం ఎటో చూసేడు...

* * *

మొదటి రెండు రోజుల్లో ఊరంతా చూడటం ముగిసింది. సుశీల తీసుకొంటున్న చొరవను, ఆత్మీయతను చూచి ఆశ్చర్యపోతున్నాడు మాధవం. ఎంతో చనువుగా కలసి మెలసి తిరగటం సరదాగా ఉంది.

ఊహించిన దానికంటె సుశీలతో ఎక్కువ మంచితనం, మాట చమత్కారం మాధవాన్ని బాగ ఆకర్షించింది.

సుశీల రూపానికి ముగ్ధుడయ్యాడు.

వేళప్రకారం ప్రోగ్రాం! కడుపునిండా కబుర్లు! ఈ రెండూ ఇద్దరి సన్నిహితాన్నీ మరింత దగ్గర చేస్తున్నది.

వేసవి అవటాన సూర్యాస్తమయం కాలేదింకా!- జన సమ్మర్దానికి దూరంగా కూర్చున్నారు సముద్రపు ఒడ్డున—

"అయితే మాధవంగారూ! మీకు సినీమాలు చూడటం...సిగరెట్లు కాల్చడంలాంటి అలవాట్లేమీ లేవా?" నిశ్శబ్దాన్ని భంగ పరచేందుకు ప్రయత్నించింది.

"నా కృషిఫలితం ఇంకా అంతవరకూ రాలేదండీ!"

"అబ్బా! ఎంత చమత్కారంగా మాట్లాడతారూ! -అదిసరే, మీ ప్రతి కథలోను ఏదో క్రొత్తదనం కన్పిస్తుంది. చదువుతున్నంతసేపూ రచయిత, ప్రతి సన్నివేశాన్ని అనుభవించాడా అన్పిస్తుంది!-అదెలా సాధ్యం?"

"అదే పూర్వజన్మ సుకృతం! దానికి జోడింపుగ ఊహా సంపత్తికూడా అవసరం! వ్రాయబోయే ఏ విషయాన్నైనా సరే, మనం అనుభవిస్తే ఫలితం ఏవిధంగా ఉంటుందా అని - ఓ క్షణంసేపు కళ్ళు మూసుకుని, మనసుని దూరతీరాలకు తరలిస్తే; కలంలోకి కావలసినంతశక్తిదానంతటదే వస్తుంది!"

మాటమార్చేందుకు ప్రయత్నిస్తున్న సుశీల "ఇంతకూ మిమ్మల్ని ఇక్కడకు ఆహ్వానించటంలో ఉద్దేశ్యమేమిటో తెలుసా?"

"బహుశః కాలక్షేపంకోసం అయివుండవచ్చు!"

"కాదు!"

"కాకుంటే పరిచయం చేసుకునేందుకేమో..."

"అదీకాదు!"

"అంతకన్నా కారణం నా ఊహ కందటంలేదు!" నిజాన్ని వప్పుకున్నాడు.

"అయితే నేనడగబోయే ప్రశ్నకు మీరు సూటిగ సమాధానం ఇవ్వగలరా?"

"ఏమిటది?" అన్నట్లు సుశీల కళ్ళల్లోకి నిశితంగా చూశాడు మాధవం.

"మీరు ఎవరినైనా ప్రేమించారా?" సూటిగా అడిగింది.

అనుకోకుండా సుశీల విసిరిన ప్రశ్నకు ఉక్కిరి బిక్కిరయ్యాడు. సుశీలను తృప్తిపరచగల సమాధానంకోసం ఆలోచించ నారంభించాడు.

"పోన్లెండి. కనీసం రచయితగానైనా మీరు ఎంతో మందిని ప్రేమించి ఉంటారు కథల్లో!" చలోక్తిగ సుశీలే సమాధాన పరచింది.

"మాధవంగారూ! ప్రేమించేందుకు కావల్సిన అర్హత లేమిటో శలవిస్తారా!" మామూలు ధోరణిలో మళ్ళీ ప్రశ్న.

"వాటికి సంబంధించిన, నిఘంటువును, నేనింకా తయారుచేయలేదు."

"ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగానైనా మీ రెవరికైనా మనసిచ్చారా?"

అలాంటి అసందర్భపు ప్రశ్నలు సుశీల ఎందుకు వేస్తున్నదో అర్థంగాని మాధవం "బాగా ప్రొద్దుపోయినట్టుంది... ఇక బయల్దేరదామా!" అన్నాడు.

"వెన్నెలన్నా...చల్లదనమన్నా...నాకెంతో ఇష్టం! మరి మీ కెలాంటివంటే ఎక్కువ ఇష్టం?!" ఎలాగైనా మరి కాస్సేపు కూర్చోబెట్టాలని ప్రయత్నంకొద్దీ మళ్ళీ మాటల్లోకి దించింది.

"మీలాగా మాట్లాడే వారంటె ఎక్కువ ఇష్టం!" మాధవం వద్దనుండి అలాటి సమాధానం కోసం వళ్ళంతా కళ్ళుచేసుకు నిరీక్షిస్తున్న సుశీల, కిలకిలా నవ్వేసింది.

మాధవానికి మరింత దగ్గరయింది సుశీల -

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను!" అంది ఇసుకలో మునివ్రేళ్ళతో ఏవేవో పిచ్చిగీతలు గీస్తున్న సుశీల.

చంద్రుని చల్లదనం మరింత ఉధృతమయింది!-

కావలసినంతగా నవ్వేశాడు మాధవం!!

* * *

"సుశీ! - అల్లుడింకా సిద్ధమవలేదు?" కాఫీ తాగుతున్న శ్రీధరంగారు సందడి చేశారు.

"అయిపోయింది నాన్నా!..."

"ఇంకా అయిపోయిందేమిటమ్మా...త్వరగా బయల్దేరండి. ట్రయిను టయిమవుతోంది మరి!"

కారు కదిలింది.

పోర్టరు సామాన్లు బెర్తుమీదుంచాడు.

"అల్లుడూ! మీ హనీమూన్ ట్రిప్ బాగా ఉండాలని విష్ చేస్తున్నాను" అంటూ షేక్ హాండిచ్చాడు శ్రీధరం గారు.

చలాకీగా రైలు కదిలింది -

నూతన దంపతుల ప్రోగ్రాంలో మొదటి మజిలీ 'ఊటీ' అదృష్టపు తొలిమలుపు మాధవానికి దగ్గరయింది!

జీవనగమ్యం ఎలా ఉంటుందో? భవిష్యత్ ఏ రూపం దాలుస్తుందో? మాధవానికి ఊహాకందని విషయం-

సుశీల పట్టుదలగల మనిషని ఆమె ప్రతి చర్యలోను ఉట్టిపడటం మాధవం నిశ్చితంగా పరీక్షిస్తునే ఉన్నాడు. కాని ఆమెలో అభిమానం ఆదరణ ఎందుకు కలిగిందో ఊహాకంద లేదు!-

ఒక్క క్షణంగూడ సుశీలను వదిలి వుండలేక పోతున్నాడు. ఆమె సౌందర్యంలో ఇమిడివున్న ప్రతిభాగాన్నీ మర్చిపోలేకుండా వున్నాడు.

కేవలం రచయితమాత్రమే అయిన మాధవం సౌందర్యోపాసకు డయ్యాడు. అహర్నిశలు సుశీల ఆరాధన తప్ప మరో వ్యాసంగమేలేదు!

వర్షం వచ్చేసూచన్లు కన్పిస్తున్నాయి.

పార్కులో పచ్చగ పెరిగిన గడ్డిపూలతో ఆడుకుంటూ వున్న సుశీల వడిలో పడుకున్న మాధవం కూనిరాగం తీస్తున్నాడు.

"ఏమండీ, మీ కేమనిపిస్తున్న దిప్పుడు?"

"చెప్పేదా!"

"చెప్పండి? ఏదైనా చక్కని కథ వ్రాయాలన్పిస్తుందా?"

"కాదు. నీలోవున్న ప్రతిఅణువును నా హృదయంలో బిగించి వేయాలన్పిస్తున్నది. ఎల్లకాలం ఇలాగే ఒడిలో పడుకుని తీయని కలలు కనాలన్పిస్తుంది!!"

"అలాగా?"

"అంతేగాదు,మనద్దరికీ ముసలితనమనేదే భగవంతుడు లేకుండా చేస్తే ఎంత బావుంటుందో ననిపిస్తున్నది!"

"ఆ...ఎంత ఆశ!"

"ఆశగాదు సుశీ! నగ్నసత్యం!! నిరంతరం నీ సుధా రస మధురాన్ని కోరటంకన్నా నాక్కావల్సిందేముంది?"

"నాకు మాత్రం కావలసింది వేరొకటుంది!"

"ఏమిటది?"

"క్షణభంగురమయిన ఆనందాలకంటే, పూర్వజన్మ సుకృతంకొద్దీ మీలో ఉన్న కళావాహినికి అంజలి నర్పిస్తూ, మిమ్మల్ని కీర్తికాంక్ష అనే మహోన్నత శిఖరాని కెక్కించి, నా జన్మ సార్థకం చేసుకోవాలనుంది!"

"పాపం! ఎంత స్వార్థం?"

"ఏం? ఆ మాత్రం హక్కునాకు లేదా!?"

"హక్కుగాదు సుశీ! అలాంటివి, కేవలం పగటికల లుగా మిగిలిపోతే మనలో మిగిలేది చివరకు నిరాశ మాత్రమే."

"అలా ఎన్నటికీ కానివ్వను! మీ గొప్పదనం విలువ, మీకే తెలీదు. మిమ్మల్ని నా వాడినిగా చేసుకుంది వృథా కానిచ్చేందుకుగాదు. మీ కవితా వాహినికి నా సహకారా న్నందించి, పది మందిలో మీకున్న విలువను రెట్టింపుజేసి ఆనందిద్దామని!"

"అదిసరే, కళాహృదయం గలవాడు అన్నివేళ్ళల్లో రాణిస్తాడంటే నాకు నమ్మకంలేదు! కళాజీవి పరిధి పరిమితం! మనిషిలో వుండే వుద్రేకాలనుబట్టే వాడిలోవున్న కళ ఉచ్ఛ స్థితి నందుకోవడం జరుగుతుంది! కాదంటావా?"

"ఈ విషయంలోమాత్రం మీతో నేనుఏకీభవించను! అంతా మనం అనుకోవటంలోనూ, ఆచరణలోకి తెచ్చుకోవటంలోనూ ఉంటుంది, ఏమంటారు?"

"సరే...సరే...మాటల్లో బాగా ప్రొద్దుబోయినట్లుంది...భోజనాని కెళదాం పద!!"

మేఘావృతమైన ఆకాశం సన్నగా జడివాన కురిపించింది—

* * *

సాయంత్రం బోటు షికారు!

రాత్రిళ్ళు వెన్నెల విహారం!

పగలల్లా ప్రకృతి సౌందర్యారాధన!

క్షణం తీరికలేకుండ కాలం గడుపుతున్నారు.

ఓ రోజున—

"సుశీ! సృష్టిలో అనుబంధాలు చాలా విచిత్రంగా ఉంటాయి గదూ?"

"ఏం ఎందుకని?"

"అవునూ...నాలో నువ్వేంచూచి ప్రేమించావు?..."

"నిజం చెప్పేదా!"

"ఆ నమ్మకంతోనే అడుగుతున్నాను."

"మీలో ఉండే భావాలను ప్రేమిస్తున్నాను!-మీ రచనలను, గౌరవాన్ని, మీ గొప్పదనాన్ని ప్రేమిస్తున్నాను!!-ఒక రచయిత భార్యనుకావాలనీ, వారి గొప్పదనంలో భాగస్వామిని కావాలనీ, అలాంటివారిని నా స్వంతం జేసుకుని వారిలో సరిక్రొత్త జీవం సృష్టించి తరించాలనీ నా కోరిక!-

అది ఈ నాటికి నిజమైంది-మీ ద్వారా ఋజువైంది!! - ఇక ఇంతకన్నా నాక్కావల్సిందేమీ లేదు—"

"అయితే నిన్ను నేను ఎందుకు పెళ్ళిచేసుకున్నానో తెల్సా! నీ అందం చూచి! - నీలో వున్న ఆకర్షణచూచి!! - నిన్ను చూస్తూ, నీ అందాన్ని ఆరాధిస్తూ, నిత్యం నీ వడిలో చంటివాడిలా తీయని కలలుగంటూ నిద్రపోవాలి!"

"అది సరేగానీ - మీ నవలలన్నీ ముగింపు విషాదాంత మవుతాయేం?"

"చీకటన్నా, వంటరి తనమన్నా నా కెంతో ఇష్టం. - కథ ఏదైనాసరే, విషాదాంతమయితేనే నా కెంతో హాయి! అలా వ్రాయటమే నా సరదా!!"

"నాకూ అదే ఇష్టం! - మనక్కావాలని స్వంతంచేసుకున్న పరిస్థితుల్లో అనుకున్న ఆనందం! - తృప్తి, కన్పించనప్పుడు దూరతీరాలకు పారిపోవాలన్పిస్తుంది! - ఒంటరిగానే కాలం గడపటం మంచి దన్పిస్తుంది!"

దూరాన్నెక్కడో పిడుగు పడ్డది!

* * *

దివారాత్రులు దిగంతాలకు జారిపోతున్నయి—

పిండారబోసిన వెన్నెల! - రాత్రి పదిగంటల సమయం.

"సుశీ! - సుశీ!" మాధవం పిలుపులో అధికారం, కాఠిన్యం కన్పించింది.

"ఎందుకలా విసుక్కుంటారు?"

"అదిగాదు సుశీ! - నన్ను విడిచి దూరంగా ఉండాలని

ప్రయత్నిస్తావేం? - మనిద్దరి మధ్యా మునుపులేని క్రొత్తదనాన్ని ఎందుకు తెస్తావు?"

"అంటే మీ ఉద్దేశ్యం?"

"నువ్వు నాదానివి! అంటే ఒక్క క్షణం నువ్వు దూరమయితే సహించలేను!!"

"కేవలం నా దేహానికి-అందానికేనా, మీరు విలువ కట్టేది! క్షమించండి! నానుండి మీరు కోరుతున్నది కేవలం సుఖాన్ని మాత్రమే! - కానీ మీ నుండి నేను ఆశించిన, ఊహించిన, ఆశయం వేరొకటి!! - నా మోజులోపడి మీ కాలాన్నే వృధాచేస్తున్నారు."

"అబ్బ...బ్బ! - ఏమిటి నువ్వనేది? నువ్వు మాట్లాడే ప్రతిమాట గొప్పదనం గురించే, పేరు ప్రతిష్ఠలు గురించేగా!- నేనేనాడో చెప్పాను, మళ్ళీ చెపుతున్నాను! నువ్వు నాకు దూరమవుతున్నంత మాత్రాన - ఆజ్ఞాపించినంత మాత్రాన, నాలో పూర్వపు కళారాధన తిరిగి రేకెత్తదు!"

"ఆ మాటంటే నే సహించను. మిమ్మల్ని నేను మరింత దగ్గర చేసుకోవటంలో ఉద్దేశ్యం, మీలో నూతన చైతన్యం కలిగించాలనీ, నేను మీ కళాఖండాల్లో ఓ వినూత్నరూపం పొందాలనీ!"

"పొరపాటు పడుతున్నావు సుశీ!"

"అవును! పొరపాటు నాదే!! - మీరు ఇదివరకటి మాధవంకాదు. నన్ను నేనే నమ్మలేకుండా వున్నాను... మీలో కళాతృష్ణ నశించింది. నన్ను నేనే మోసంచేసుకున్నానేమో అనిపిస్తున్నది."

"సుశీ! ఏమిటా మాటలు...ఆ మాటకొస్తే నీవను

కున్నదే నిజం! నాగురించి ఏవేవో పిచ్చిపిచ్చికలలు కన్నావు. నా భవిష్యత్తును నీ గుప్పిట్లో బంధించి ఏదో భావుకు తిందా మనుకున్నావు!! - అందుకు తప్పు నాదా!!!"

"కాదు! - తప్పంతా నాది" ఏ గొప్పదనాన్నయితే, మీలో చూచి ప్రేమించానో; మీ నుండీ ఏదైతే నే కోరు కున్నానో... అది కేవలం అస్పృశ్యమని ఇప్పుడే తెలిసింది! - మీ రింతగాదిగజారిపోతారనుకోలేదు! - నన్ను నేనే వంచించు కున్నాను!!"

"సుశీ? జరిగిందాన్ని గురించి మనం తర్కించుకున్నా ప్రయోజనంలేదు-నిజంగ నువ్వు ఆశించిన గొప్పదనం నాలో ఇప్పుడు కన్పించక పోవడానికి కారణం నేనుగాదు! - నువ్వు!- నీ అందం!!"

"అవును. తప్పునాదే! నా ఆదర్శహృదయం, అభిరుచి, మీ అనుభవాలకు జోడింపయితే మీరు మరింతగా రాణిస్తా రనుకోవటం, నేను పదిమందిలో ఫలానావారి భార్యనని గొప్పగా చెలామణీ అవుతాననుకోవటం నా పొరపాటే!"

"మనిద్దరిమధ్యా ఎందుకీ అభిప్రాయభేదాలు సుశీ! నా నుండి నీ వెన్నటికీ దూరం కాకూడదు - కానివ్వను!"

"స్వార్థం వెనుక మీ కర్తవ్యాన్ని విమర్శించే అధి కారం నాకుంది! నా ఆశయం నెరవేరకపోయిం తర్వాత మని ద్దరిమధ్యా మమకారాలకు తావులేదు. నానుండి మీరు ప్రేమను పొందనూలేరు."

"ఏమిటి నువ్వనేది?"

"మీ నుండి నేను ఆశించింది వేరు, నా నుండి మీరు

కోరేది మరొకటి. విభిన్నాభిప్రాయాలతో జీవితాంతం కలిసి ఉండటం కష్టం!"

"సు...శీ...లా!" చేయిచేసుకున్నాడు మాధవం.

పరిస్థితులు మనిషిని పశువును చేస్తయి!

ఇద్దరిమధ్య అగాధాలు ఏర్పడ్డాయి. ఒకరు చెప్పేది మరొకరు విన్పించుకోరు - చీటికి మాటికి యిద్దరూ ఘర్షణ పడటం రోజూ దినచర్యగా మారింది.

చివరి రోజుల్లో ఓ రోజున—

"సుశీ, నానుండి నువ్వు విడాకులే కావాలనుకుంటే అది సాధ్యంగాని పని!! కాని ఒక్కటి మాత్రం నిజం! నిన్నీ స్థితికి తీసుకొచ్చిన నీ మనోదార్బల్యానికి, నీ ప్రవర్తనకు నా మనస్సెంతో బాధపడుతున్నది. ఎక్కడో హాయిగా రోజులు గడుపుకునే నన్నూ, నా భవిష్యత్తును నీ సొంతం చేసుకుని ఆనందించాలనుకున్నావు! నా ఆశయాలకు సంకెళ్ళు వేసి... నన్నొక్క పిచ్చివాడినిచేసి ... యిప్పుడు దూరతీరాలకు తరిమివేయా లనుకుంటున్నావు! కాని ఒక్కటి మాత్రం నిజం! నన్ను నువ్వు దూరం చేసుకున్నందువల్ల పొందే ఆనందంకన్నా బాధే ఎక్కువ! దీనంతటికీ కారణం నీ దార్బ ల్యం! ఎండమావుల్లాంటి నీ కోర్కెలు!!"

"ఏమైనాగానీండి! కట్టుకున్నంత మాత్రాన యిష్టం వున్నా లేకపోయినా జీవితం గడిపే ఓర్పు నాలో లేదు. మీ నుండి నే కోరిన గొప్పదనం ఆనందం నేను పొందలేనప్పుడు - వంటరిగానైనా జీవితం గడిపేందుకు వెనుకాడను!!"

"సుశీలా! ఎంతో ఆదర్శంహృదయంగల నీ మనస్సును యెందుకిలా రాయిచేసుకుంటావు!"

"దీనంతటికీ కారణం మీరే. నా మోజులోపడి మీ కర్తవ్యాన్నీ, కళనే మర్చిపోయారు!! మామూలు మనిషిగ మిమ్మల్ని నేను ఎన్నడూ ప్రేమించలేదు! ప్రేమించలేను!! ఇప్పటికైనా మించిపోయింది లేదు. మీలోవున్న కళకు తిరిగి జీవం పోయండి."

"అదిమాత్రం నా చేతగాని పని! ఎండి బీటలు వారి పోయిన కళాతృష్ణ మళ్ళీ నా కలంలో ప్రవహించదు. ఎన్ని విధాల ప్రయత్నించి చూచినా, నాలో వచ్చే సమాధానం మాత్రం యిదే! అయినా నీతృప్తికోసం నే నెన్నోసార్లు ప్రయత్నించి చూచేను - కానీ కలం ముందుకు సాగలేదు! దానికి కారణం, ప్రతి అక్షరంలో ప్రతిబింబించే నీ అందం నా పురోభివృద్ధికి సంకెళ్ళు వేస్తున్నది! కాని సుశీ! నన్ను కట్టుకుని సుఖపడదామనుకున్న నీ హృదయాన్ని గాయపరచా నన్న అప్రతిష్టకూడా నాకే దక్కింది!!"

"అయితే నా చివరి నిర్ణయంకూడా ఇదే! నన్ను సుఖపెట్టలేని మీరు, కనీసం నానుండి దూరమైన తర్వాతనైనా, మీ కళావాహినికి జీవం పోయగలిగితే; నా కదేచాలు! నాకదే ఆనందం!!" అంటూ విసురుగా వెళ్ళింది సుశీల.

విధి చేతిలో బందీ అయినాడు మాధవం!

కేసు వారంరోజుల్లో తేలుతుంది!